అంగన్‌వాడీలకు అవస్థలు

- ఏడాదిన్నర నుంచి పోడూరులోనే ప్రాజెక్టు కార్యాలయం
- పాలకొల్లులో ఏర్పాటుపై మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



గర్భిణులు, బాలింతలకు అవగాహనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిర (ఫైల్)

పాలకొల్లు అర్బన్: బాలింతలకు, గర్భిణులు, ఐదేళ్ల లోపు బాలబాలికలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం పోడూరులో ఏర్పాటు చేసిన సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ (ఐసీడీఎస్) ప్రాజెక్టు 2023 జూన్‌లో పాలకొల్లు ప్రాజెక్టులో విలీనమైంది. అయితే అప్పటి నుంచి అంటే సుమారు ఏడాదిన్నర కాలం నుంచి పాలకొల్లులో ఈ సంస్థకు సొంత కార్యాలయం లేక పోడూరులోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పోడూరు ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లాలంటే ఆపసోపాలు పడుతున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో యలమంచిలి, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు రూరల్ మండలాలతో పాటు పోడూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలతో కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే పాలకొల్లులో సొంత కార్యాలయం ఏర్పాటుకు అధికారులు గతేడాదిన్న కాలం నుంచి ఆరా తీస్తున్నారు. అద్దె భవనం కోసం అన్వేషణ చేస్తున్నారు.

యలమంచిలి అంగన్‌వాడీల అగచాట్లు

పోడూరు ప్రాజెక్టుకి యలమంచిలి మండలంలోని శివారు గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు, అలాగే లంక గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు, పాలకొల్లు మండలంలోని శివారు గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు పోడూరు ప్రాజెక్టు కార్యాలయానికి సమావేశాల నిమిత్తం వెళ్లడానికి నానా అగచాట్లు పడుతున్నారు.

ప్రాజెక్టు పరిధిలో...

మండలం	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
పోడూరు	251	237	3031
పాలకొల్లు	246	371	3245
యలమంచిలి	207	385	3061
పాలకొల్లు అర్బన్	193	275	2134

మంత్రి నిమ్మల దృష్టికి తీసుకువెళ్లాం

సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ, పాలకొల్లు ప్రాజెక్టు కార్యాలయాన్ని పాలకొల్లు మునిసిపాల్టీ ఏరియాలో ఏర్పాటుకు కార్యాలయాల కోసం అన్వేషణ చేస్తున్నాం. మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి కూడా తీసుకు వెళ్లాం. త్వరలోనే ప్రాజెక్టు కార్యాలయాన్ని పోడూరు నుంచి పాలకొల్లుకి మారుస్తాం.

– సీహెచ్ ఇందిర, ఐసీడీఎస్ పీఓ, పాలకొల్లు



ఆగర్రులో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

పాలకొల్లు ప్రాజెక్టులోని అంగన్‌వాడీ కేంద్రాలు

పాలకొల్లు మండలం:	78
పాలకొల్లు పట్టణం:	25
యలమంచిలి మండలం:	85
పోడూరు మండలం:	70

క్లుప్తంగా

వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవం



హోమంలో పాల్గొన్న గోవింద స్వాములు

పాలకొల్లు సెంట్రల్: అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆఖరి రోజు స్వామివారి బ్రహ్మోత్సవ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా స్వామివారి కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సోమవారం నవగ్రహ సుదర్శన అష్టదిక్పాలక హోమం చేశారు. వివిధ సన్నాయి వాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, కోయడాన్స్‌లతో స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాదంరెడ్డి సత్యం, కుంపట్ల శ్రీనివాస్, మేడికొండ శ్రీనివాస్, కేవీ కృష్ణవర్మ, బీరక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపేటలో ఉద్రిక్తత



ఇరుపక్షాలకు సర్దిచెబుతున్న ఎస్సై జయలక్ష్మి

నరసాపురం: స్థానిక ఒకటో వార్డు శ్రీహరిపేటలో సోమవారం కొందరు పాస్టర్లు క్రైస్తవ ప్రచారం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ వార్డులో క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ తిరుగుతుండగా స్థానిక యువకులు పాస్టర్లను ఆపి, ఇంటింటికీ తిరిగి మతం మారమని కరపత్రాలు ఎందుకు పంచుకపంచుతున్నారని ప్రశ్నించారు. తాము బైబిల్ బోధనలు వివరిస్తున్నామని పాస్టర్లు బదులిచ్చారు. ఈలోపు వీహెచ్‌పీ కార్యకర్త కటికిరెడ్డి రవి, మరికొందరు వచ్చి పాస్టర్లతో వాదనకు దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి సిబ్బందితో వచ్చి ఇరుపక్షాలతో మాట్లాడారు. పాస్టర్లు అక్కడి నుంచి వెనుతిరగడంతో వివాదం సద్దుమణిగింది.

కమలాలతో అభిషేకం



కమలాపండ్లతో క్షీరారామలింగేశ్వరస్వామికి అభిషేకం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామ క్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేవారు. స్థానిక అయ్యంగార్ బేకరీ యజమాని ఎంపి కృష్ణ స్వామివారికి 250 కేజీల కమల పండ్లతో అభిషేకం చేయించారు. వీటిని సాయంత్రం వరకూ భక్తుల దర్శనార్థం ఉంచి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముత్యాల శ్రీనివాసరావు, అర్చకులు కిష్టప్ప పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, మూర్తిస్ జనరల్ స్టోర్స్, నరేష్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మధన్ మాట్లాడుతూ విద్యార్థులు ఓ ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయుల సూచనలతో చదువుకుంటే పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. క్లబ్ సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, గుండుమోగుల వీరాస్వామి, విటాకుల రాజా, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ ప్రభావతి, యూటీఎఫ్ ట్రెజరర్ మద్దాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం స్థానిక 24, 25 వార్డులల్లో పేదలకు ఇళ్ల స్థలాల దరఖాస్తులు పంపిణీ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇళ్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామని వాగ్దానం చేశారని, ఆ వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు.

ధనుర్మాస పూజలు



శివలింగం

పాలకొల్లు అర్బన్: వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని పార్వతీ సమేత శివదేవస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సంతాన ప్రాప్తి కోసం ఆలయ ఆవరణలో దంపతులు కొబ్బరిమొక్కలు నాటారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చక స్వామి ర్యాలి సతీష్, ఆలయ ఈఓ కేవీ సాగర్, గ్రామ పెద్దలు భక్తులకు సేవలందించారు. దిగమర్రులోని ఉమా నరేంద్రస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

మీకోసంలో ఫిర్యాదులు

మొగల్తూరు : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం)లో రెండు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. శేరేపాలెం గ్రామానికి చెందిన కత్తుల నర్సింహరావు తనను తన కుమారులు చూడటం లేదని, మరొకరు తన స్థలన్ని సర్వే చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, పీఆర్ ఏఈఈ వెంకటేశ్వరరావు, ఏఓ రహీమ్, ఎంఈఓ శామ్యూల్ జాన్, మండల పర్వేయర్ ధన్‌రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ రావు, ఈవోపీఆర్డీ నవీన్ పాల్గొన్నారు.

ఆరు వినతులు

పెనుగొండ: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు వినతులు అందినట్లు పెనుగొండ తహసీల్దారు జి.అనితకుమారి తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ రాజ్‌కు రెండు, రెవెన్యూ శాఖకు సంబంధించి నాలుగు వినతులు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు కట్టించండి

యలమంచిలి: తన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అక్రమంగా విద్యుత్ వినియోగించిన వ్యక్తుల నుంచి కరెంట్ బిల్లు కట్టించాలని బాడవ గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఇలపకుర్తి నర్సింహరావు సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాడవకు చెందిన వినుకొండ శ్రీనివాస్, రావూరి ఏసు అనే వ్యక్తులు గత మూడు నెలలుగా తన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ వాడుకుని ఆక్వా సాగు చేశారని పేర్కొన్నారు. వారి కనెక్షన్ తీయించాలని సంబంధిత విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని తెలిపారు. చివరకు తాను కోర్టుకెతే కోర్టు ఉత్తర్వులు మేరకు మూడు నెలల తరువాత అక్రమ కనెక్షన్స్ తొలగించారని పేర్కొన్నారు. ఈ మూడు నెలల సమయంలో రూ.1,67,287 విద్యుత్ బిల్లు వచ్చిందని తెలిపారు. ఆ బిల్లును వారు కట్టడం లేదని, వారితో బిల్లు కట్టించాలని కోరుతూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.



మొగల్తూరులో ఫిర్యాదు స్వీకరిస్తున్న తహసీల్దార్

9 నుంచి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

పెనుగొండ: ఆచంట కాపుల వీధిలోని సీతారాముల ఆలయం వద్ద ఈ నెల 9 నుంచి 13 వరకు పుణ్య వైకుంఠ ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 9న కుంకుమార్చనలు, లక్ష తులసీ పూజ, 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా అభిషేకాలు, స్వామి వారి కల్యాణం, 11న కుంకుమార్చనలు, 12న భారీ అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు. 13న పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని వివరించారు. భక్తులంతా పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

పీఎం ఫసల్ బీమా యోజన గడువు పెంపు

మొగల్తూరు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్టు వ్యవసాయాధికారి అబ్దుల రహీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రుణం తీసుకున్న వారు లేదా రుణం తీసుకోని రైతులు ఈ అవకాశాన్న సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రహరీ కూల్చారంటూ ఫిర్యాదు

యలమంచిలి: తన ఇంటి ప్రహరీని ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని యలమంచిలి లంక పల్లిపాలెంకు చెందిన మేడా పావని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మూడు తరాలుగా పల్లిపాలెంలో గ్రామకంఠం భూమిలో వారి కుటుంబం ఇల్లు కట్టుకుని నివసిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రహరీ నిర్మిస్తుండటంతో కొందరు స్థానికులు పంచాయతీలో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు పనులు నిలిపి వేయమని నోటీసు ఇవ్వడంతో 10 రోజుల క్రితమే పని ఆపేశామని తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో జనం తమ ఇంటిపైకి వచ్చి దౌర్జన్యం చేసి, శ్లాబు కటింగ్ యంత్రంతో ప్రహరీని ధ్వంసం చేశారని వివరించారు. పోలీసులకు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని, దౌర్జన్యం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పావని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మొగల్తూరు: స్థానిక శ్రీనివాస ఆసుపత్రిలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ శ్రీనివాస రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలకొల్లుకు చెందిన రాధా రమణి లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారని, గ్రామస్తులు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీనివాసరాజు కోరారు.

ముగిసిన చదరంగం శిక్షణ

భీమవరం: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదరంగం కోర్సు లెవిల్–1పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కోచ్ మాదాసు కిషోర్ తెలిపారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో చెస్ ఉచిత శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. చదరంగం విద్యార్థుల్లో చెస్ ద్వారా సృజనాత్మకత, ఏకగ్రత పెంపొందించుకోవచ్చన్నారు.

ఉపాధి అవకాశాలపై శిక్షణ

నరసాపురం: వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలపై మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్టు స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్స్ ఫేజ్–1 కార్యక్రమాన్ని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. హోం ట్రియాంగిల్ సంస్థ ద్వారా పట్టణంలోని యువతీ యువకులకు టీవీ, వాషింగ్ మెషీన్, గ్రీజర్, ప్లబింగ్, ఎలక్ట్రికల్, ఏసీ రిపేర్లు, బ్యూటీషిన్స్ శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. పట్టణంలో సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి, పొదుపు సంఘాల సహకారంతో వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పొందేలా చేస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్, రేషన్, పాన్ కార్డు జిరాక్స్‌లతో మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 10వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం మోహన్, సీఓ సత్యనారాయణ, దేవీ, ఆర్పీలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

నరసాపురం: సబ్ జైలు వ్యవహారాలు నిబంధనలకు అనుగుణంగా సాగాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.వియదుర్గ ఆదేశించారు. సోమవారం ఆమె నరసాపురం సబ్ జైలును సందర్శించారు. జైలులో ముద్దాయిలకు పోలీసుశాఖ ద్వారా సంబంధిత వాయిదాల వివరాలు సకాలంలో తెలుస్తున్నదీ లేనిదీ, ఉచిత న్యాయ సహాయానికి సంబంధించిన న్యాయవాదులు తరచూ సబ్‌జైలుకు వస్తున్నదీలేనిదీ, ప్రిజనల్ లీగల్ ఎయిగ్ క్లినిక్ సభ్యుల పనితీరు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమలేక, న్యాయవాదిని నియమించుకోలేని వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జైలు సూపరింటెంట్ టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



జైలు రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి విజయదుర్గ

అద్దేపల్లి సేవలు అభినందనీయం

పాలకొల్లు సెంట్రల్: విద్యా దాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి నెలకొల్పిన ఈ కళాశాలలో చదువుకుని ఇక్కడికే ప్రిన్సిపాల్‌గా రావడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి జూనియర్ కళాశాలలో అద్దేపల్లి 126వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అద్దేపల్లి కుటుంబ సభ్యులు అద్దేపల్లి బాలు మాట్లాడుతూ ఎంతోమంది ఉన్నత విద్యా వంతులను, అధికారులను అందించిన ఘనత ఈ కళాశాలకు దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం 22 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు టీ షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏఎస్ఎస్ రమణకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏఎస్ఎన్ఎం జూనియర్ కళాశాలలో అద్దేపల్లి జయంతి

ధ్యానంపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ధ్యానం అనేది వ్యక్తిగతంగా శరీర ఆరోగ్య స్థితిని కలిగి ఉండడమే కాకుండా, మనోశక్తిని వృద్ధి చేస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ పి.శోభారాణి అన్నారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆధ్యాత్మిక విశ్వగురువు, విశ్వస్ఫూర్తి గురువు అనుగ్రహ ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆసన, ప్రాణాయామ, ధ్యాన ప్రక్రియపై అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. వైస్ ప్రిన్సిపాల్ రవి శంకర్, స్ఫూర్తి ట్రస్టీ ఎం గంగాభవానీ, కుటుంబ సభ్యులు, యోగా శిక్షకులు జీవీఎస్ ప్రభాకర్, కిషోర్, టి.శిరీష, పి.శ్వేత తదితరులు పాల్గొన్నారు.



యోగా శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శోభారాణి

వేతన బకాయిలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్ట్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతన బకాయిలు చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని కోరుతూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిబ్బందిచే సోమవారం ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు ఓసూరి వీర్రాజు మాట్లాడారు.

విద్యార్థులకు అభినందన

పెనుమంట్ర: రాష్ట్ర స్థాయిలో ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌కు తమ పాఠశాలకు విద్యార్థులు ఎంపికైనట్టు జుత్తిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్ మణిభారతి సోమవారం తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినులు కె.జాద్వికారెడ్డి, కె.లక్ష్మీనాగ భవానీలు తయారు చేసిన మ్యాథమెటిక్స్‌లో పైథాగరస్ థియరీ వర్కింగ్ మోడల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికై ననట్టు చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడ బయలుదేరి వెళ్తున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు అభినందించారు.



జుత్తిగ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రైలు ప్రయాణం.. రివర్సు

ఆశ్చర్యానికి గురైన ప్రయాణికులు


భీమవరం: సహజంగా బస్సులు, కార్లు, లారీలు, ట్రాక్టర్లు, ఆటోల వంటి వాహనాలను రివర్స్ గేర్‌లో వెళుతుండడం చూస్తుంటాం. దీనికి భిన్నంగా రైలు బండి రివర్స్‌లో వచ్చిన విచిత్ర పరిస్థితి ఇది. వివరాలోనికి వెళితే సోమవారం నరసాపురం నుంచి విజయవాడ వెళ్లే రైలు ఉదయం పదిన్నర గంటలకు పాలకోడేరు మండలం శృంగవృక్షంలోని రైల్వేస్టేషన్‌లో ఆగాల్సి ఉంది. అయితే స్టేషన్ నుంచి ముందుకు వెళ్లిపోయింది. దీంతో శృంగవృక్షం రైల్వే స్టేషన్‌లో దిగాల్సిన, ఎక్కాల్సిన ప్రయాణికులు ఆందోళనలో పడ్డారు. సుమారు రెండు కిలో మీటర్ల దూరం వరకు వెళ్లి రైలు తిరిగి వెనుకకు రావడంతో రైలులోని ప్రయాణికులు, రైల్వే గేటు వద్ద ఆగిన ఇతర వాహనాల ప్రయాణికులు ఆశ్చర్యానికి గురయ్యారు. తామేప్పుడు ముందుకు వెళ్లిన రైలు రివర్స్‌లో వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లడం చూడలేదన్నారు. దీనిపై రైల్వే అధికారులను వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



శృంగవృక్షం స్టేషన్ వద్ద రివర్స్‌లో వచ్చిన రైలు

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఆకివీడు: ఉపాధి హామీ పనుల పరిశీలకు సోమవారం మండలంలోని పెదకాపవరం, చినకాపవరం గ్రామాల్లో కేంద్ర బృందం ప్రతినిధులు పర్యటించారు. 2020–21, 2021–2022, 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. పెదకాపవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధి హామీ నిధులతో మొక్కలు నాటడం, స్థల పూడిక వంటి పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి, ఆయా పనులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గార్డెన్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. చినకాపవరంలోని స్టోరేజ్ మంచినీటి చెరువును పరిశీలించారు. ఉపాధి హామీలో చెరువు తవ్వకం పనులు, కూలీల వేతనం, తదితర వాటి రికార్డులను పరిశీలించారు. చెరువు ఏ విధంగా ఉపయోగపడుతుందో స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్, జల శక్తి అభియాన్, అమృత్ సరోవర్ నిధుల వినియోగంపై బృందం ప్రతినిధులు జితేంద్ర సింగ్, మౌనికలు డ్వామా ఎస్ఈ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈఈలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ ఊసల బేబీ స్నేతు తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్లో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న బృందం

త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక త్యాగరాజ భవనంలో 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్ సత్యనారాయణమూర్తి మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యాచారులు ఎం.సురేంద్రనాథ్ (హైదారాబాద్) వారిచే ఏర్పాటు చేసిన కూచిపూడి, భరత నాట్యం శ్రోతలను అలరించింది. 30 మంది కళాకారులతో ప్రదర్శించిన అద్భుత నాట్య సంగమం పలువురిని ఆకట్టుకుంది. సుమారు నాలుగు గంటల పాటు సాగిన నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహా భారతంలోని ద్రౌపది పడిన కష్టాలు, అవమానాలు భరిస్తూ జరిగిన సన్నివేశాల కథనాలతో నృత్య ప్రదర్శన చూపరులను కట్టి పడేసింది. పాండవులు, కౌరువుల మధ్య గల వైరాన్ని, జూదంలో ధర్మరాజు తన సర్వస్వాన్ని కోల్పోవడం, ద్రౌపది వస్త్రాపహరణం, రౌద్రుడైన భీముడు దుర్యోధన దుశ్శాసనులను వధించడం తదితర సంఘటనలతో నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో గన్నాబత్తుల శ్రీనివాస్, చెరుకువాడ వెంకట్రామయ్య, చెరుకువాడ రంగసాయి, కారుమూరి చినబాబు, ఆరేటీ ప్రకాష్, దాయన చంద్రాజీ, అల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన